క్లుప్తంగా

చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలకు పంపేందుకు ప్రథమ టీమ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించే చర్యలను ఐసీడీఎస్ సిబ్బంది చేపట్టారు. స్థానిక లంకపేట-2 సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రథమ్ టీమ్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులను చైతన్య పరిచే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ పద్మావతి, సూపర్ వైజర్లు మంగ, ప్రథమ్ టీమ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త హేమలత, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాహిత్య వేత్త విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): భారతీయ సాహిత్యంలో తెలుగు కథను ఉన్నత శిఖరానికి చేర్చిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి మరణం సాహిత్య లోకానికి తీరని లోటని సాహితీ స్రవంతి ఏలూరు జిల్లా కన్వీనర్ కడలి రామాంజనేయులు పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతుని, తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. సాహిత్య ప్రస్థానం మాసపత్రికలో అనేక కథలు, వ్యాసాలు అందించిన వ్యక్తి విశ్వనాథరెడ్డి అని గుర్తు చేశారు. అభ్యుదయ రచయితల ఉద్యమంలో విశాలాంధ్ర ప్రచురణలో కీలక భాధ్యతలు నిర్వహించారని, పాఠ్యపుస్తకాలు, సార్వత్రిక విశ్వవిద్యాలయం వేదనలకు అక్షర రూపమివ్వడంలో ఆయనది గొప్పముద్ర అని రామాంజనేయులు కొనియాడారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు నార్త్ సెక్షన్ పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతంలోని విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు ఈ నెల 23న నిర్వహించనున్నట్టు ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మంగళవారం ఉదయం ఐదు నుంచి తొమ్మిది గంటల వరకు అశోక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని రామచంద్రరావు పేట, విజయవిహార్ సెంటర్, రమా మహల్ సెంటర్, పోలీస్ క్వార్టర్స్, కలెక్టరేట్ కాంపౌండ్, కలెక్టరేట్ వెనక రోడ్డు, ఏటిగట్టు, కొత్త బస్టాండు ప్రాంతం, అశోక్ నగర్, పత్తేబాద, ఫైర్‌స్టేషన్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

ప్రజలకు సేవ చేయడం వరం

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలోని 79 సచివాలయాల పరిధిలో ఏడాది కాలంలో విశేష సేవలందించిన వలంటీర్లలో ఐదుగురు సేవా వజ్ర, 14 మంది సేవా రత్న, 1,310 మంది సేవా మిత్ర అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ఏలూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం దుశ్శాలువా కప్పి, పతకం, సర్టిఫికెట్ అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీతల మనోగతం ఈ క్రింది విధంగా ఉంది.

సంతోషం అనిపించింది



నా పరిధిలో 32 మందికి పింఛన్లు, 18 మందికి చేయూత, 22 మందికి ఇళ్ల పట్టాలు అందించాం. కాన్సర్ బాధితురాలి కుటుంబానికి బీమా అందేలా కృషి చేశాను. ఒక విద్యార్థి రేషన్ కార్డు లేక ఇబ్బంది పడుతుంటే సమస్య పరిష్కరించా. రేషన్‌కార్డు వచ్చేలా చేశాను. ఆ విద్యార్థికి కాలేజీలో ఫ్రీ సీటు వచ్చింది. నీవల్లే నేను చదువుతున్నాను అని విద్యార్థి నాతో చెబితే ఎంతో సంతోషంగా అనిపించింది.

– డి.భార్గవి, వలంటీర్ (సేవా వజ్ర), 36వ డివిజన్, 27వ సచివాలయం

సేవతో సంతృప్తి



నాకు ఇద్దరు పిల్లలు. ప్రజలకు సేవ చేయడం సంతోషంగా ఉంది. ఇంటి పరిసరాల్లోని మా వారికే ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాలు అందిస్తూ అండగా ఉండడం ఆనందాన్నిస్తోంది. విద్యుత్ బిల్లులు కారణంగా కొందరికి పథకాలు నిలిచిపోతే సమస్యను కార్పొరేటర్ కత్తిరి రామ్మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాం. కరోనా విపత్కర సమయంలోనూ మా డివిజన్‌లోని పేదలకు సేవలు అందించటం తృప్తిగా ఉంది.

– జి.శివకుమారి, వలంటీర్ (సేవా వజ్ర), 33వ డివిజన్

సంతృప్తినిస్తోంది



మా గ్రామంలోని ఒక గుడి పూజారికి ముగ్గురు కుమారులున్నారు. రేషన్ కార్డు కారణంగా సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. వారికి రేషన్‌కార్డు వేరు చేయించి పథకాలు మంజూరు చేయించటం సంతోషంగా ఉంది. ఒక ఒంటరి మహిళకు కాపు నేస్తం మంజూరు చేయించడం సంతృప్తి నిచ్చింది. వలంటీర్‌గా సేవలు అందించటం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నా.

– బి.భుజంగరావు, వలంటీర్ (సేవారత్న), 27వ డివిజన్, చొదిమెళ్ల

ఆశీర్వదిస్తున్నారు



నా పరిధిలో 58 కుటుంబాలకు సేవలు అందిస్తున్నా. 30 మందికి వృద్ధాప్య పింఛన్లు అందిస్తున్నాను. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వెళ్లి పెద్దలకు పింఛన్ ఇస్తుంటే వారంతా తమ ఆశీర్వాదాలు అందిస్తున్నారు. దీంతో ఎంతో సంతోషంగా ఉంటుంది. వాళ్ల కుటుంబాల్లోని వ్యక్తిగా ఎంతో ఆప్యాయంగా చూస్తున్నారు. వారికి ప్రభుత్వ పరంగా ఏది కావాలన్నా దగ్గరుండి చేస్తూ అండగా ఉంటున్నాం. ఇదంతా సీఎం వైఎస్ జగనన్న చలువతోనే సాధ్యమైంది.

– ఎ.లక్ష్మీప్రియ, వలంటీర్ (సేవా రత్న), 39వ డివిజన్, 14వ సచివాలయం

సీఎం జగనన్నకు కృతజ్ఞతలు



నాతోపాటు అనేకమందికి సాయం చేసేలా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. తెల్లవారుతుండగానే వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయటం, వారు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మమ్మల్ని ప్రజలు గుర్తించటం, మా సేవలను ప్రభుత్వం గుర్తించి అవార్డుకు ఎంపిక చేయటం ఆత్మసంతృప్తి నిస్తోంది. ఇలాంటి ప్రభుత్వాన్ని ప్రజలు, నేను ఎప్పుడూ చూడలేదు.

– వి.మౌనీష, వలంటీర్ (సేవా రత్న), 46వ డివిజన్, 19వ సచివాలయం

కష్టం వస్తే గుర్తొచ్చేది వలంటీర్



ప్రజలకు ఏ కష్టం వచ్చినా.. మొదటగా గుర్తుకు వచ్చేది వలంటీరే. ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలు మంజూరుకు వలంటీర్ సేవలను ఎంతో అభినందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ప్రారంభించిన తొలినాళ్లలోనే ప్రజామోదం పొందింది. వలంటీర్, సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతోంది. ఎమ్మెల్యే ఆళ్ల నాని హయాంలో ప్రజలకు మంచి జరుగుతుందనే భరోసా లభించింది.

– కృష్ణమూర్తి, ప్రాజెక్టు ఆఫీసర్, ఏలూరు కార్పొరేషన్

కార్మిక నేత పర్స జీవితం ఆదర్శనీయం



సత్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): వీర తెలంగాణ విప్లవ పోరాట యోధుడు, కార్మికవర్గ మహానేత, మాజీ ఎమ్మెల్యే పర్స సత్యనారాయణ జీవితం నేటి కమ్యూనిస్టులకు ఆదర్శనీయమని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. పర్స 8వ వర్ధంతి కార్యక్రమం సీపీఎం స్థానిక జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పర్స చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ తన జీవితాన్ని ప్రజలకు అంకితం చేసి, ఎమ్మెల్యేగా ఆయన వచ్చే అలవెన్స్‌ను సైతం పార్టీకి ఇచ్చిన గొప్ప వ్యక్తి అని రవి కొనియాడారు. పార్టీ నాయకులు పి.రామకృష్ణ, కట్టా సత్యనారాయణ, కె.లెనిన్, త్రినాథ్, ఎం.సత్యం, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

- సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు పర్స సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ సాధన కోసం పర్సా తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు. నాయకులు కె.విజయలక్ష్మి, సీహెచ్ సుందరయ్య, వీవీఎస్ ప్రసాద్, వి.సాయి బాబు, జె.గోపి, మహేశ్వరి పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



రాష్ట్ర కమిటీకి ఎన్నికైన ప్రతినిధులను సన్మానిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక యాదవ సంఘ భవనంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా లంకా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా మారగాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా పిలగల కొండలరావు ఎన్నికయ్యారు. ఏలూరు జిల్లా కమిటీ అధ్యక్షుడిగా ఆరేపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తమ్మలాల నాగ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా నల్ల రామారావు, పి.హరి నారాయణ ఎన్నికయ్యారు. కాగిత అచ్యుత్ అధ్యక్షతన నిర్వహించిన బీసీ కులాల జేఏసీ సర్వ సభ్య సమావేశంలో లంకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తోన్న బీసీ అన్ని ఉపకులాల ఉద్యోగులతో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా కన్వీనింగ్ కమిటీలను ఎన్నుకున్నట్టు చెప్పారు. ఈ సంఘం బీసీ కులాల జేఏసీకి అనుబంధంగా పనిచేస్తుందన్నారు. బీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి పనిచేయడం ఈ సంఘం ముఖ్య లక్ష్యమని తెలిపారు. సభాధ్యక్షుడు అచ్యుత్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. సమావేశంలో ఉక్కుసూరి గోపాలకృష్ణ, ఎం.సూర్యనారాయణ, అన్నపరెడ్డి మురళి, నాగాస్త్ర, మరడ అనిల్, ఎండీ ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో ఏరియా ఆసుపత్రి ఏర్పాటు చేయాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరులో ఏరియా ఆసుపత్రిని తక్షణం ఏర్పాటు చేయాలని, జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రద్దయిన వైద్యులు, సిబ్బంది బెడ్స్‌ను పునరుద్ధరించాలని, మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రాజకీయ పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ మెడికల్ కాలేజ్ ఏర్పాటు ఆనందించే విషయమన్నారు. అయితే దీని పేరుతో జిల్లా నలుమూలల నుంచి ఏలూరు వస్తున్న ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న జిల్లా ప్రభుత్వాసుపత్రి వైద్య సేవలను రద్దు చేసినట్టు చెప్పారు. దీంతో ఇక్కడ పనిచేసే 42 మంది స్పెషలిస్ట్ వైద్యులు, 150 వరకు సిబ్బంది, 350 బెడ్స్ రద్దు అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తగినంత వైద్య సిబ్బంది అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సాచించి ఏరియా ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నగర కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, ఆప్ జిల్లా కన్వీనర్ సీహెచ్ సురేష్, కాశి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామర్ పుస్తకాల పంపిణీ

పెదపాడు: సత్యవోలు పరిసర ప్రాంతంలోని విద్యార్థినీ విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సర్పాపురం నియోజకవర్గ పరిశీలకుడు ఘంటా ప్రసాదరావు తెలిపారు. సత్యవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ తరగుతులను సోమవారం ఘంటా ప్రసాదరావు ప్రారంభించారు. మూడో తరగతి నుంచి డిగ్రీ వరకు ఇంగ్లిషు, గణితం, జనరల్ నాలెడ్జ్ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇన్‌స్పైర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు జీ క్రీస్తుప్రకాశ్ సహకారంతో ఇంగ్లిషు గ్రామర్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేసారు. కార్యక్రమాన్ని ఘంటా పద్మ శ్రీ ప్రసాదరావు, ఎస్ కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగారావు, సొంగల ఉమామహేశ్వరరావు, వైకుంఠపు ధనుంజయ్ సహకారంతో నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాయుడు ఖండవల్లి పురుషోత్తం తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలంటూ వినతి



ఎరియర్స్ బకాయిల కోసం వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన వేతన ఎరియర్స్ తాలూకా సొమ్ము చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘం ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సోమవారం నగర కమిషనర్ వెంకట కృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ సిబ్బందికి బకాయి పడిన వేతనాల ఎరియర్స్‌లో కొంత భాగం ఏప్రిల్ మాసంలో చెలించినందుకు కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. జూన్ మాసంలో విద్యాసంస్థలు తిరిగి ప్రారంభమవుతున్న దృష్ట్యా మిగతా ఎరియర్స్ ఉద్యోగ సిబ్బందికి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థలో ఉద్యోగ సిబ్బంది సమస్యలపై అధికారులతో, యూనియన్ ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు, యూనియన్ సహాయ కార్యదర్శులు ఎస్ శ్రీనివాసరావు, ఎస్ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జూట్ కార్మికులకు న్యాయం చేయాలి



కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): చట్ట విరుద్ధంగా ఏలూరు జూట్ మిల్లును మూసివేశారని, కార్మికులకు రావాల్సిన పరిహారాలు చెల్లించకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలనే యాజమాన్య వైఖరిని నిరసిస్తూ స్థానిక కొత్తూరు జూట్ మిల్లు వద్ద సోమవారం ఇఫ్టూ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జూట్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని, కార్మికులకు రావాల్సిన రాయితీలు చెల్లించాలని, యాజమాన్యం మొండి వైఖరి విడనాడాలని నినదించారు. ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జూట్ మిల్లును గతేడాది జనవరి 27న మూసివేశారని, దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ ఈ నెల 25న బహిరంగ సభ ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇఫ్టూ కార్యకర్తలు వై.నాగేశ్వరరావు, త్రినాథ్, రాము, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మానవత భవన నిర్మాణానికి విరాళం

పెదపాడు: మానవత భవన నిర్మాణానికి దాతలు ఆర్థిక సాయం అందించారు. సంబంధిత నగదును మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు అందించారు. బాణాల నరసింహారావు రూ.50 వేలు, కురెళ్ల సుభాచారి రూ.25వేలు, స్థానిక పరమేశ్వరి ఏజెన్సీస్ 100 సిమెంట్ కట్టలు విరాళంగా అందించారు. వారిని మానవత సభ్యులు అభినందించారు.

మానవత నూతన కార్యవర్గం

అప్పనవీడు శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కురెళ్ల సుభాచారి, ఉపాధ్యక్షుడిగా దయాల ప్రభాకరరావు, కార్యదర్శిగా కొల్లేపల్లి నారాయణరావు, కోశాధికారిగా పాటోలు గణేష్ బాబు సుంయుక్త కార్యదర్శిగా ఘంటా ఇందిరాదేవి, ఈసీ విద్య గూడపాటి జయరామచంద్రరావు, వైద్యం దేవిశెట్టి సూర్యనారాయణ, అవేర్‌నెస్ కన్నిగంటి వెంకట సుబ్బారావు, ఎమర్జన్సీ గొళ్ల మల్లికార్జునరావు నూతన కార్యవర్గంగా ఎన్నికయ్యారు.

పట్టాల పంపిణీకి మద్దతు

దెందులూరు: అమరావతిలో పేదలకు పెద్ద ఎత్తున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్ల స్థలాల పంపిణీ నిర్ణయాన్ని మాలమహానాడు స్వాగతించి మద్దతునిస్తోందని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. సోమవారం కొవ్వలిలో ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ వేలాదిమంది పేదలకు శాశ్వత నివాసం కల్పించే దృక్పథంతో కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి పెద్ద మనస్సుతో పట్టాలు పంపిణీ చేస్తుంటే కొందరు పేదలకు పట్టాలు అడ్డుకునేలా వ్యాఖ్య లు చేయడం దురదృష్టకరమన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా మంచిచేసే వారిని అభినందించాలని, పేదల జీవన విధానానికి తోడ్పాటు సహకారం అందించేలా తప్ప అడ్డుపుల్ల వేసే విధంగా వ్యవహరించకూడదన్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

దెందులూరు: ఉండ్రాజవరంలో ప్రతిభ గల నాగవంశీయుల విద్యార్థులకు పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి ఆర్థిక సహకారం అందించేందుకు ఎంపిక కార్యక్రమం పూర్తి చేశామని నాగవంశీయుల సంఘం అధ్యక్షుడు కాలా శ్రావణ్ కుమార్ అన్నారు. సోమవారం ఉండ్రాజవరంలో ఆయన మాట్లాడుతూ తన తండ్రి కాలా నర్సింహారావు జ్ఞాపకార్థం పేద విద్యార్థులను చదువులో ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం ఒక్కొక్కరికి రూ.10 వేలు మూడేళ్లుగా అందిస్తున్నామని తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వారిని ఎంపిక చేశామన్నారు.

శ్రీనివాసరావుకు నివాళులర్పించిన కొఠారు

పెదవేగి : అనారోగ్య కారణంగా కుటుంబంలోని వ్యక్తిని కోల్పోవడం ఎవ్వరూ తీర్చలేని లోటని ఏపీ ఆయిల్ ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు అన్నారు. సోమవారం పెదవేగి మండలం బాపి రాజుగూడెంలో చింతలపూడి రమణయ్య అన్నయ్య చింతలపూడి శ్రీనివాసరావు(57) గుండెపోటుతో మరణించగా ఆయన భౌతికకాయానికి కొఠారు రామచంద్రరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, అన్ని విధాలుగా అండగా నిలుస్తామని భరోసానిచ్చారు. ఈ పరామర్శలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, మన్నె బాబూరావు, బొట్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పెదవేగి : కోట్లాది గ్రామీణ పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టం నేడు ప్రమాదంలో పడిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పనిలో కూలీలకు కనీస సౌకర్యాలు కలిపించాలని కోరుతూ సోమవారం పెదవేగి మండలం లక్ష్మీపురంలో చెరువు వద్ద ఉపాధి పని చేస్తున్న కూలీలతో వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయడం కోసం ఉపాధి హామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటో సిస్టం, రెండు పూటల పనిని తీసుకువచ్చిందని అన్నారు. దీని వల్ల ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం కలుగుతుందని మండిపడ్డారు. ఈ పథకాన్ని ఎత్తివేయడం కోసం బీజేపీ చేసిన అనేక కుట్రలు చేస్తోందన్నారు. ఉపాధిహామీలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ ఫొటోసిస్టంను వెంటనే రద్దు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు విస్తరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ఫీల్డు అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పాలనలో సంతోషంగా ప్రజలు



వృద్ధులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదవేగి : సంక్షేమ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వానికి మరో సారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం జగన్నాథపురంలో స్థానిక సర్పంచ్ మాత్రపు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సోమవారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏ ఇంట్లో ఏ ఏ పథకాల ద్వారా ఎంత మేరకు లబ్ధి చేకూరిందో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందిస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా ప్రజలంతా సాదర స్వాగతం పలుకుతున్నారన్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందామని ప్రజలు చెబుతున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి తమకు మళ్లీ మళ్లీ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏవైనా లోపాలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. అర్హత ఉండి పథకాలు అందని వారి వివరాలు సేకరించి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, విజయరాయి సొసైటీ అధ్యక్షులు పాలడుగు సత్యనారాయణ (పెద బాబు), మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణ్ రావు, ఎంపీపీ తాతా రమ్యకుమార్, మేడికొండ కృష్ణారావు, మండల కన్వీనర్ కేశన సతీష్, ఎంపీటీసీ రాచప్రోలు చంద్రరావు, స్థానిక నాయకులు పర్వతనేని రామచంద్రరావు, బలుసు శ్రీనివాసరావు, తాడేపల్లి విజయ్‌కుమార్, మనికొండ చంద్రరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	08
బెండకాయలు	16	కంద	56
పచ్చిమిర్చి	56	బీట్‌రూట్	38
కాకర కాయలు	40-48	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	40	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	32	పాలకూర	08-12
దొండకాయలు	18	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	14	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	17

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	15
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	19
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	37